క్లుప్తంగా

పంటల బీమా గడువు పెంపు

నరసన్నపేట: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవడానికి గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో సాగు చేసే వరి, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, చోడి వంటి పంటలకు రైతులు తమ వాటాగా బీమా చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు గమనించి ఈ నెలాఖరులోగా బీమా చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, మీ–సేవ కేంద్రాల్లో ప్రీమియం మొత్తం చెల్లించవచ్చన్నారు. వరికి ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480, మొక్కజొన్నకు రూ.570, పెసరకు రూ.300, మినుముకు రూ.300, చోడికి రూ.240 చెల్లించి బీమా చేయించుకోవచ్చన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణాల పరిశీలన


చాపరలో షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆదినారాయణ రెడ్డి

మెళియాపుట్టి: అంచనాల మేరకు పశువుల షెడ్లు నిర్మించాలని ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తారా ఆదినారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చాపర, పరశురాంపురం, జోడూరు తదితర గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్లను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. నాసిరకమైన, పాత సామగ్రితో నిర్మిస్తే బిల్లులు చెల్లించబోమన్నారు. నిర్మాణాల విషయంలో టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పలువురు సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ


మాజీ ఎంపీటీసీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడలో మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండాల దేవేంద్రరావు విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఆవిష్కరించారు. దేవేంద్రరావు జ్ఞాపకార్థం, ఆయనపై ఉన్న గౌరవంతో యువకులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. దేవేంద్రరావు గ్రామాభివృద్ధికి చేసిన కృషిని పలువురు కొనియాడారు. సర్పంచ్ కొండాల బాబూరావు, ఇసై జనార్దనరావు, కొండాల గణేష్ తదితరులు ఉన్నారు.

జైల్ సదుపాయాలపై ఆరా


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం పరిశీలించారు. జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సలహాలు, సూచనలు కావాలంటే ఉచితంగా అందిస్తామన్నారు. జైల్లో ఉన్న సదుపాయాలు గురించి ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, స్థానిక న్యాయవాదులు కొండలరావు, శ్రీలక్ష్మి, జైల్, స్థానిక కోర్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


శ్రేయ మిశ్రోను సత్కరిస్తున్న ఏపీఆర్‌ఓ శివారెడ్డి

పాతపట్నం: శ్రీశైలం దివ్యక్షేత్రం మల్లికార్జున స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన (ప్లేట్ డాన్స్)లో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత శ్రేయ మిశ్రో ప్రతిభ కనబరిచింది. గురువారం రాత్రి శ్రీశైలంలో శ్రేయ నృత్య ప్రదర్శన చేసి అందరినీ ఆకట్టుకుంది. శ్రీశైలం దేవస్థానం ఆహ్వానం మేరకు శ్రేయ నృత్య ప్రదర్శన చేశారు. శ్రేయను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఆర్‌ఓ శివారెడ్డి సర్టిఫికెట్, మెమెంటో అందించి సత్కరించారు. నిర్వాహకురాలు నాగమణి, నాట్యాచార్యులు అర్చన ఉషశ్రీ తదితరులు అభినందించారు.



అవగాహన

వర్షాలు మరో రెండు రోజులు పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని చిక్కాలవలసలో శుక్రవారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యం నిల్వ చేసిన రైతులతో మాట్లాడారు. టార్పాలిన్లు అవసరమైతే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్నాయన్నారు. ధాన్యం బస్తాల కిందకు నీరు వెళ్లకుండా చుట్టూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పడిన వరి పంటపైన, నీటిలో మునిగినా, తడిచిన వరి పనలపైనా ఉప్పు నీటిని పిచికారీ చేయాలని సూచించారు. వీఆర్వో చక్రవర్తి, వీఏఏ ఝాన్సీ పాల్గొన్నారు. – నరసన్నపేట



ఇరుముడుల సందడి

బూర్జ మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 45 రోజుల దీక్ష పూర్తయిన సందర్భంగా పలువురు అయ్యప్ప భక్తులు ఇరుముడులు వేసి శబరిమలకు బయలుదేరారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. – బూర్జ



భౌ పెడుతున్నాయ్..

మెళియాపుట్టి మండల కేంద్రంలోని ఓ మాంసం దుకాణం పరిసర ప్రాంతంలో కుక్కలు మాంసం వ్యర్థాల కోసం ప్రతిరోజూ ఎదురుచూస్తున్నాయి. రోజూ అదే ప్రాంతంలో మాంసం వ్యర్థాలు తినడానికి గుంపులు, గుంపులుగా సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బంది పెడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – మెళియాపుట్టి



రాళ్లుతేలిన రహదారి

బూర్జ మండలం పాలవలస పంచాయతీ కొత్తవలస గిరిజన గ్రామ రహదారి అధ్వానంగా ఉంది. కొత్తవలస జంక్షన్ నుంచి (పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారి) కొత్తవలస గ్రామానికి సుమారు 1.50 కిలో మీటర్లు రాళ్లు తేలాయి. ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – బూర్జ

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు.. రంగం సిద్ధం!

- రాజకీయ ఒత్తిళ్లే కారణమా!
- విధుల నిర్వహణపై ఆప్కాస్‌కు నివేదిక

ఆమదాలవలస:

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను విధుల నుంచి తప్పించేందుకు కూటమి నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఉద్యోగాల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. గత పాలకవర్గం ఆధ్వర్యంలో వీరిని నియమించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వీరిని తొలగించాలని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు భోగట్టా.

మూడు నెలల జీతం నిలిపివేత..

ఆప్కాస్‌లో సభ్యులుగా ఉన్న వీరిని తొలగించేందుకు కొన్ని పరిమితులు ఉంటాయని తెలియడంతో అప్పటినుంచి మూడు నెలలపాటు జీతాలు వేయకుండా నిలిపివేశారు. ఇదేమని ప్రశ్నించిన ఉద్యోగులకు సాంకేతిక లోపాల కారణంగా జీతాలను వేయలేకపోతున్నట్లు సమాచారం ఇచ్చారు. ఆప్కాస్ నుంచి అధికారులకు మౌఖిక నిబంధనలు చేరడంతో ముగ్గురినీ విధుల నుంచి తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. సెక్యూరిటీ గార్డులకు నోటీసులు ఇచ్చి విధి నిర్వహణలో సక్రమంగా పని చేయడం లేదని, మీకు ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అప్పటికే వీరు కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి పరిస్థితులను విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని పరిశీలించి



నివేదిక ఇస్తామని కలెక్టర్ వద్ద ఏడీ నాగజ్యోతిలక్ష్మి వివరించారు. వీరిద్దరికి మళ్లీ రెండు నెలల తర్వాత తొలగించేందుకు మరోసారి నోటీసులు ఇచ్చారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లగా పని చేస్తున్న నాయుడు, విమలకు నోటీస్‌లు కూడా ఇవ్వకుండా తొలగించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

లబోదిబోమంటున్న బాధితులు..

సెక్యూరిటీ గార్డులు సనపల శ్రీలక్ష్మి, బెండి అరుణకు నవంబర్ జీతం ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. మీరు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఆప్కాస్‌లో మీ పేర్లు తొలగించారని ఏఎంసీ కార్యదర్శి చెప్పడంతో లబోదిబో మంటున్నారు. ఉద్యోగాల నుంచి తొలగించినట్లు పత్రం ఇవ్వాలని వీరు అడుగుతున్నారు. విధులకు డుమ్మా కొడుతున్నారని అధికారులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని బాధితులు వాపోతున్నారు. రోజు వారి కలెక్షన్లు బ్యాంకులకు తీసుకెళ్లి జమ చేస్తున్నామన్నారు. సీసీ టీవీ ఫుటేజీలు గమనిస్తే ఏ రోజు విధులకు డుమ్మా కొట్టామన్నది స్పష్టమవుతుందన్నారు. ఇటీవల నెల రోజులుగా పనులు చెప్పకుండా తమను తూలనాడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే మీ సేవలు అవసరం లేదని కార్యదర్శి చెప్పడం అన్యాయమన్నారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వారిని తొలగించినట్లు మౌఖికంగా ఆదేశాలిస్తున్నామని, రాతపూర్వకంగా ఉన్నతాధికారులను అడిగి తెలియజేస్తామన్నారు.


ఆముదాలవలస మార్కెట్ కమిటీ కార్యాలయం

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

జలుమూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ధాన్యం భద్రపర్చుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీ కె.సురేష్ వివరించారు. భూ సమస్యలు పరిష్కారానికి జరుగుతున్న రెవెన్యూ సదస్సుల ప్రయోజనాలను తహసీల్దార్ జెన్ని రామారావు వివరించారు. వైద్య, పశుసంవర్ధక శాఖలు, స్త్రీ, సంక్షేమ పథకాల అమలు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ద్వారా రహదారుల నిర్మాణాలు, తదితర అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వివరించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గౌరవ సభ్యుల వేతనాలు చెల్లించండి

ఎంపీటీసీల గౌరవ వేతనాలు చెల్లించాలని పలువురు సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. నిధులు మంజూరు చేసి చెల్లిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాతపట్నం విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు



మెమెంటోలు అందుకుంటున్న విద్యార్థులు రోహిత్ సాయి, లక్ష్మీసహస్ర

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ శక్తి సంరక్షణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లఘు చిత్ర పోటీల్లో పాతపట్నంకు చెందిన ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో వివంత హోటల్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎనర్జీ కె.విజయానంద్, ఎండీ ఏపీజెన్‌కో కేవీఎస్ చక్రధర్ చేతులమీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో విద్యార్థి రోహిత్ సాయి, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థిని బల్లెడ లక్ష్మీ సహస్రల లఘు చిత్రాలు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యాయి. విద్యార్థులకు రూ.2 వేలు, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థులను ఆయా పాఠశాల ప్రిన్సిపాల్స్ కె.వి.రత్నకుమారి, ఎం.వెంకటరమణ, పాఠశాల చైర్మన్ జి.రాజేశ్వరరావు, డైరెక్టర్‌లు హేమలరాజు, రాజ్‌కుమార్‌లు అభినందించారు.

ముగిసిన శిక్షణ

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదు రోజులుగా నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపల పెంపకం వాటి ద్వారా వచ్చే ఉత్పత్తులకు విలువ జోడించినప్పుడే అధిక లాభాలను పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపల ఎగుమతి ద్వారా కేంద్రం ఆదాయం పొందుతున్నప్పటికీ, దేశీయంగా వినియోగం పెంచడానికి నాణ్యమైన ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఇతర సదుపాయాలు అవసరమన్నారు. ఆ దిశగా విజన్ 2047 డాక్యుమెంట్ తయారీ అమలుపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు డాక్టర్ నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అపార మత్స్య సంపద, నీటి వనరులను వినియోగించుకుంటే వలసలను నివారించవచ్చన్నారు. ఉత్పత్తుల తయారీ విధానాలు, అందులోని మెలకువలను మత్స్య శాస్త్రవేత్త సి.హెచ్.బాలకృష్ణ తెలియజేశారు. చేపలు, రొయ్యల పరిశుభ్రం, పట్టుబడి, విలువ ఆధారిత ఉత్పత్తులు అనే శిక్షణ కరదీపికలను విడుదల చేశారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందించారు. ఆర్ష్ సంస్థ అధినేత నూక సన్యాసిరావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, సంతోష్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


కరదీపికను విడుదల చేస్తున్న అధికారులు, మత్స్య రైతులు

మహిళా మార్ట్‌ను అభివృద్ధి చేస్తాం

నరసన్నపేట: మహిళా మార్ట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి స్థానికులకు మరిన్ని సరుకులు తక్కువ ధరలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ కొండలరావు అన్నారు. శుక్రవారం నరసన్నపేట మహిళా మార్టును పరిశీలించారు. గతంలో ఎటువంటి అక్రమాలు జరగలేదన్నారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి వంటి పండగలకు ప్రత్యేక ఆఫర్లు పెడతామన్నారు. అవసరం మేరకు సిబ్బంది ఉన్నారన్నారు.

పగలే విద్యుత్ వెలుగులు



సారవకోట: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న విద్యుత్ దీపాలు పగలే వెలుగుతున్నాయి. ప్రతి నిత్యం ఇదే విధంగా ఉన్నా.. స్థానిక విద్యుత్ శాఖ, పంచాయతీ సిబ్బంది పట్టించుకునే దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జగనన్న పుట్టినరోజు వేడుకలకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్



ఆమదాలవలస: ఈ నెల 21న నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు పట్టణ శివారులో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జగనన్న పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, ఆమదాలవలస మున్సిపాలిటీలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హిరమండలంలో..

హిరమండలం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమంలో శనివారం నిర్వహించనున్నారు. పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.


అకాల వర్షం.. రైతుకు నష్టం


నరసన్నపేట: పెట్రోల్ బంక్ ఎదురుగా నేల కొరిగిన వరి చేను

గత మూడు రోజుల నుంచి వర్షం కురవడంతో రైతుకు తీవ్రనష్టం కలిగింది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఇప్పటికే వరి చేను కోతలు కోసి పొలాల్లో కుప్పలు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల కోయకుండా ఉన్న వరిచేను నేలకొరిగింది. అపరాల పంటలైన పెసర, మినుముతోపాటు వాణిజ్య పంటలు మొక్కజొన్న, సారికంద, కట్టిజనుము, కూరగాలయ పంట పొలాల్లో నీరు చేరటంతో ఆయా పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షం నీటిని పొలం నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. – సాక్షి నెట్‌వర్క్


ఎల్.ఎన్.పేట: సిద్ధాంతం ప్రాంతంలో పొలాల్లో చేరిన వర్షం నీరు


ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట వద్ద సారికంద పొలంలో చేరిన వర్షం నీరు


పొందూరు: గోరింట వద్ద పంట పొలాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లోకేష్, అధికారులు


సారవకోట: గొర్రిబంద సమీపంలో వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


బూర్జ: నీలాదేవిపురంలో పెసర, మినుము పొలంలో చేరిన వర్షం నీరు


బూర్జ: అన్నంపేట వద్ద తడిసి ముద్దయిన పత్తి పంట


మెళియాపుట్టి: గొప్పిలి వద్ద నేల కొరిగిన వరి పంట

ప్రశాంతంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో డిపార్ట్‌మెంటల్ పరీక్షను శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష శుక్రవారం రాశారు. రెండు షిప్టుల్లో 350 మంది వివిధ విభాగాల ఉద్యోగాలు ఈ పరీక్షలు రాశారు. ప్రభుత్వ ఉద్యోగులు విధిగా వారి స్థాయిల మేరకు ఈ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు తీరును సిబ్బందిని అడిగి ఆర్డీవో తెలుసుకున్నారు. పరీక్షలు ఉన్నన్ని రోజులూ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మాకివలస పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు.